నవతెలంగాణ
ఆదిలాబాద్
బుధవారం | ఫిబ్రవరి 05, 2025 | www.navatelangana.com

ఎక్సైజ్ అధికారుల దాడులు

నవతెలంగాణ - చింతలమానేపల్లి

మండలంలోని లంబడిహెట్టి, రణవెల్లి, దింద, గూడెం గ్రామాల్లో దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ వి.రవి తెలిపారు. 20 లీటర్ల నాటు సారాను, 40 దేశీదారు బాటిళ్ల స్వాధీన పరచుకుని, ముగ్గురిపై కేసులు నమోదు చేశామన్నారు. అనంతరం నాటు సారా, గంజాయి తదితర మత్తు పదార్థాలతో వలన కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఐదుగురు నిందితులను తహసీల్దార్ మునావర్ షరీఫ్ ముందు బైండోవర్ చేశామన్నారు. దాడులలో ఆదిలాబాద్ ఎక్సైజ్ సిఐ అక్బర్ హుస్సేన్, ఎస్సైలు ఐ.సురేష్, పి.రాజేశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు అవగాహన

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమాన్ని దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి జి.కల్పన హాజరయ్యారు. రైతు నేస్తం కార్యక్రమంలో అడవి పందులతో కలిగే నష్టాలు, నివారణ చర్యలపై వీడియో ప్రదర్శన, అడవి పందులను నివారించడానికి సోలార్ కంచెల ఏర్పాటు, జీవ కంచాల ఏర్పాటు, ఇతర పద్ధతులపై అవగాహన కల్పించారు. మిరప పంటలో చీడ పీడలపై అవగాహన వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి చర్చలను రైతులతో ఏర్పాటు చేశారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి కల్పన మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి చేయాలని, ఒకే రకమైన పంటను వేయడం వల్ల పంట దిగుబడులు తగ్గడమే కాక, భూమి నిస్సరమై చీడ పీడ ఉధృతి పెరుగుతాయని తెలిపారు. నీటి వసతి ఉన్నచోట ఆయిల్ పామ్ సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సీహెచ్ ప్రభాకర్, ఏఈవో రమ్య రైతులు పాల్గొన్నారు.

'పీఎం సూర్యఘర్'తో సౌర వెలుగులు

- జిల్లాలో 27 స్థలాల గుర్తింపు
- విద్యుత్ అవసరంతో ఎస్‌హెచ్‌జీల బలోపేతం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం విద్యుత్ వినియోగం పెరగడంతో పాటు విద్యుత్ చార్జీల మోత ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. విద్యుత్ చార్జీలు నివారించడానికి సౌర విద్యుత్ వైపు విద్యుత్ వినియోగదారుడు దృష్టి సారించేలా కేంద్ర ప్రభుత్వం 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన' పేరుతో తీసుకొచ్చిన సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి జిల్లా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో పాటే మహిళల సాధికారిత కోసం ప్లాంట్ల నిర్వహణ స్వయం సహాయక సంఘాలకు అప్పగించడానికి సన్నాహాలు చేస్తున్నారు.



జిల్లాలో ఇదీ పరిస్థితి

విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్న ప్రాంతంలోని పొలాల రైతులు సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు ఇది కరీంనగర్, వరంగల్ ప్రాంతాల్లో అమల్లోకి రాగా జిల్లాలో దీన్ని అమలుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో జిల్లాలో 13 మండలాల్లో 27 స్థలాలను గుర్తించిన అధికారులు వీటిలో 141 ఎకరాలు అందుబాటులో ఉన్నట్లు నివేదిక సిద్ధం చేశారు. ప్లాంట్ ఏర్పాటుకు 3.5 నుండి 4 ఎకరాల స్థలం అవసరం కానుండగా అంతే స్థలం ఉన్న 27 ప్రాంతాలను ఎంపిక చేశారు.

విద్యుత్ అమ్మకంతో ఎస్‌హెచ్‌జీల బలోపేతం

పీఎం సూర్యఘర్ పేరుతో ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్ల ద్వారా ఇంటికి వినియోగించే విద్యుత్ కంటే అదనంగా వచ్చిన మొత్తాన్ని డిస్కంలకు అమ్మవచ్చు. సోలార్ ప్లాంట్ల నిర్వహణ 25 సంవత్సరాల లీజుకు ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఒక్క మెగావాట్‌కు రూ.4కోట్లు ఖర్చుకానుండగా స్వయం సహాయ సంఘాల మహిళలు 10 శాతం చెల్లించి మిగతా మొత్తాన్ని రుణాలు పొందే అవకాశం ఉంటుంది. అధికారుల లెక్కల ప్రకారం కొన్ని సంవత్సరాలలో పెట్టుబడి తిరిగి రానుండగా మిగతా పది సంవత్సరాలు మహిళా సంఘాలకు లాభం చేకూరనుంది.

నిరంతర ఆదాయానికి అవకాశం

సోలార్ విద్యుత్ వైపు వినియోగదారులను మరల్చే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన ద్వారా నిరంతరాయం పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఒక కిలో వాట్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.84000 ఖర్చుకు గాను రూ.30000 రాయితీ వస్తుండడంతో పాటు ఒక కిలో వాట్‌కు నాలుగు యూనిట్ల ఉత్పత్తి జరుగుతుంది. మూడు కిలోవాట్ ప్యానల్ ఏర్పాటు చేసుకుంటే 12యూనిట్లు ఉత్పత్తి కాగా దీనిలో ఇంటి అవసరాలు పోగా మిగతా మొత్తాన్ని డిస్కం కొనుగోలు చేయడానికి ప్రత్యేకంగా ఒక లెక్కింపు యంత్రం ఏర్పాటు చేయనున్నారు. ఏదేమైనా విద్యుత్ వినియోగదారులకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఈ పథకం ఉపయోగపడనుందని భావిస్తున్నారు.



విద్యుత్ వినియోగదారులకు ఉపయోగకరం : విరేష, ఇన్‌చార్జి ఎస్ఈ విద్యుత్‌శాఖ

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం సూర్యఘర్ విద్యుత్ వినియోగదారులకు ఉపయోగకరంగా ఉంటుంది. జిల్లాలో అధికారులు కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉంది. రానున్న రోజుల్లో సోలార్ విద్యుత్ వినియోగం కోసం ఈ పథకం ఉపయోగపడనుంది.

వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగ పట్టివేత

- సహకరించిన భార్య, వెండి వ్యాపారిపై కేసు
- 3.1 కిలోల వెండి, మూడు మాసాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ డా.జానకిషర్మిలా



నవతెలంగాణ-భైంసా

భైంసాలో పలు ఆలయాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో దొంగను గుర్తించి అదుపులోకి తీసుకున్న పోలీసులు వివిధ ఆలయాల్లో చోరీ చేసిన వెండి, బంగారు అభరణాలను స్వాధీనపర్చుకున్నారు. చోరీకి సహకరించిన నిందితుడి భార్యతో పాటు చోరీ సొత్తును కొనుగోలు చేసిన వ్యాపారిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం భైంసాలోని క్యాంపు కార్యాలయంలో ఎస్పీ డా. జానకిషర్మిల, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, సీఐ గోపీనాథ్, ఎస్సైలు శ్రీనివాస్ యాదవ్, గౌస్ అహ్మద్‌తో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన విజయ్ శిండే(36) కొంత కాలంగా మహారాష్ట్రలోని నాందేడ్ బలరాంపూర్‌లో నివాసముంటూ చోరీలకు పాల్పడుతున్నాడు. భైంసా పట్టణలోని నర్సింహస్వామి ఆలయం, పూలేనగర్ హనుమాన్ మందిర్, సంతోషిమాత మందిర్, కైలాస్ ఫ్యాక్టరీ పరిధిలోని శ్రీ బాలాజీ దేవాలయంతో పాటు నిర్మల్ రోడ్డు మార్గంలోని హిమా వైన్స్‌లో ఇటీవల వరుసగా చోరీలకు పాల్పడ్డాడు. ఎలాంటి ఆచూకీ, ఆనవాళ్లు దొరకకుండా చాకచాక్యంగా చోరీలకు పాల్పడుతున్న దొంగను పట్టుకునేందుకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినిగియోగించి కేసును ఛేదించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా చోరీలకు పాల్పడ్డట్టు ఒప్పుకున్నాడు. ఆలయాల్లో చోరీ చేసిన వెండి, బంగారు అభరణాలను విక్రయించేందుకు భార్య పూజా శిండే, మహారాష్ట్రకు చెందిన వెండి వ్యాపారి పాండురంగ్ రామారావు సహకరించారు. వారి వద్ద నుంచి చోరీ చేసిన 3కిలోల 150 గ్రాముల వెండి, 3మాసాల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు విజయ్ శిండేను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనలో మిగతా ఇద్దరిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ వెల్లడించారు. కేసును భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో భైంసా టౌన్ సీఐ గోపీనాథ్, ఎస్సై శ్రీనివాస్ యాదవ్ చాకచాక్యంగా వ్యవహరిస్తూ సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించారు. వీరితో పాటు ఇద్దరు మహిళా పోలీసులు, నలుగురు కానిస్టేబుళ్లు కృషి చేశారని, వారదందరినీ అభినందిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ డీజీఎం, గిరిజన ఉద్యోగుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు దరావత్ పంతులా నాయక్‌తో కలిసి మంగళవారం ప్లాంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాసులు గిరిజన ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పంతులా నాయక్ మాట్లాడుతూ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమంతో పాటు హక్కుల పరిరక్షణకు సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. సింగరేణి గిరిజన ఉద్యోగుల అభ్యున్నతికి ఎల్లప్పుడు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ చీఫ్ ఓఅండ్ఎం జేఎస్ సింగ్, ఏజీఎం కేఎస్ఎన్ ప్రసాద్, డీజీఎం తుకారాం, శివప్రసాద్, వేణుగోపాల్‌రావు, ప్రభాకర్‌రావు, శ్రీనివాస్, దేవేందర్, మోహన్, సత్యనారాయణ, అప్పారావు, చంద్రమణి, పరుశురామ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం సఖీ కేంద్రం, మహిళ సాధికారత విభాగం వారి ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి కళాశాల ప్రిన్సిపల్ డా. అతీక్ బేగం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ లావణ్య మహిళల చట్టాలపై అవగాహన కల్పించగా, లీగల్ కౌన్సిలర్ సంఘమిత్ర విద్యార్థులకు సమాజంలో జరిగే సైబర్ నేరాల గురించి తెలియజేశారు. అలాగే కేస్ వర్కర్ నాగమణి స్త్రీలకు సంబంధించిన చట్టాలను హెల్ప్ లైన్ సెంటర్ గురించి వివరించారు. చట్టలపైన ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని సూచించారు. సమాజంలో తమకేమైన ఇబ్బందులు ఎదురైతే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రఘు, గణపతి, ఉమెన్స్ ఎంపవర్మెంట్ కోఆర్డినేటర్ టి.స్వప్న, రేఖ, పృథ్వి, గోపాల్, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు బీఆర్ఎస్ నాయకుల తరలింపు



నవతెలంగాణ-తాంసి

అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులను ఆయా స్టేషన్ల ఎస్సైలు కలీం, రాధిక మంగళవారం ఉదయాన్నే అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగించిందన్నారు. రుణమాఫీ, రైతుబంధు రైతుల ఖాతాల్లో పూర్తిస్థాయిలో ఇప్పటివరకు జమ కాకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి వాగ్దానాన్ని అమలు చేయాలని కోరుతూ మంగళవారం అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతున్న తమను పోలీసులు అక్రమంగా పోలీస్‌స్టేషన్‌కు తరలించి నిర్బంధించడం సిగ్గుచేటన్నారు. ఎన్నిసార్లు నిర్బంధించినా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాడతామని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు రమణ, కృష్ణ, అశోక్, రఘు, లింబాజీ, ఉత్తమ్, తులసీరామ్, రాజన్న పాల్గొన్నారు.

రైతు బీమా నామినీ వివరాలు నమోదు



నవతెలంగాణ నిర్మల్ రూరల్

నర్సాపూర్(జి) మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో మంగళవారం రైతు బీమా నామినీ వివరాలను ఏఓ గణేష్ పరిశీలించారు. రైతు జాదవ్ లవ్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. రైతు బీమా నామిని ఖాతా వివరాలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. కుటుంబ సభ్యుల పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డ్, బ్యాంకు వివరాలు అడిగి పరిశీలించారు.

భయం... భయం...

- జనావాసాలకు దగ్గరగా సంచరిస్తున్న పులి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దుబ్బగూడెం గ్రామ శివారులో పులి సంచారంతో ఒక్కసారిగా గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వారం క్రితం నుంచి బుగ్గగూడెం, కన్నాల, పెద్దనపల్లి, దుబ్బగూడెం శివారు ప్రాంతంలోనే సంచరిస్తుండటంతో మరింత భయాందోళన చెందుతున్నారు. పులికి ఎటువంటి హానీ జరగకూడదనే ఉద్దేశంతో ఫారెస్ట్ అధికారులు పులి కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ గమనిస్తున్నారు. మంగళవారం ఉదయం దుబ్బగూడెం గ్రామానికి దగ్గరగా పులి రావడంతో ఒక్కసారిగా ఫారెస్ట్, పోలీస్ అధికారులు అప్రమత్తయ్యారు. రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతం కావడంతో వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించి అటుగా ఎవరూ వెళ్లకుండా చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతంలో పులి కదలికలను గమనిస్తున్న ఫారెస్ట్ అధికారులకు ఎదురుగానే పులి ఎదురు పడింది. వారిని చూసిన పెద్దపులి తన దారిని మార్చుకొని చెట్ల పొదల్లోకి వెళ్లిపోయింది. మళ్లీ పులి కనిపించ లేదు. పాదముద్రల ఆధారంగా అధికారులు పులి కదలికలను గుర్తించారు. వారం రోజులుగా పెద్దపులి ఇక్కడే మకాం వేసింది. పెద్దపులి ఉండడానికి పెద్దగా అనువైన ప్రదేశం కాకపోయినప్పటికీ ఆకలితో ఉన్న పెద్దపులి మూడు రోజుల క్రితం కన్నాల శివారులో అడవి పందిపై దాడి చేసి రెండు రోజులు ఆహారం తీసుకుంది. నీటి సౌకర్యం, ఆహారం ఉండడంతో ఇక్కడే విశ్రాంతి తీసుకుంది. ఇక్కడి నుంచి వెళ్లిపోయే క్రమంలో ప్రజల తాకిడితో అలజడికి గురై పులి ఇక్కడే ఉండి పోయింది. మంగళవారం వెళ్లిపోయే పరిస్థితి ఉన్నప్పటికీ మళ్లీ అలజడికి గురైన పెద్దపులి దుబ్బగూడెం మీదుగా వచ్చి ఇక్కడే ఉండిపోయింది. ఇప్పటి వరకు ఎటువంటి వేట చేయలేదు. ప్రస్తుతం జనాల అలజడితో పెద్దపులి భయానికి గురై దుబ్బగూడెం శివారులో ఉండి పోయి ఇక్కడే సేద తీరుతుంది. ప్రస్తుతం విశ్రాంతిలో ఉందని, తన దారిలో వెళ్లిపోతుందని, దానిని ఇబ్బందులకు గురి చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా పులి శాంతంగా ఉందని, దగ్గరగా మనుషులు చూసినా ఎవరికి కూడా హానీ చేసే విధానంలో లేదని తెలుపుతున్నారు. వారం రోజులుగా దుబ్బగూడెం శివారు పంట పొలాల నుంచి సోమగూడెం పాత బస్తీ శివారు మీదుగా పెద్దనపల్లి, బెల్లంపల్లి మండలం కన్నాల, బుగ్గగూడెం మధ్య నిత్యం పులి సంచరిస్తుండగా మంగళవారం దుబ్బగూడెం గ్రామానికి దగ్గరగా రావడంతో అందరూ భయాందోళనకు గురయ్యారు. ఫారెస్ట్ అధికారులు పెద్దపులి కదలికలను కనిపెడుతూ పెట్రోలింగ్ చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పులి సంచారం సమాచారం ఉంటే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఇదిలా ఉండగా ఈ ప్రాంతంలో చిరుత పులి కూడా సంచరిస్తుండగా దాని ప్రయాణం సదూర ప్రాంతాలను దాటుతూ వస్తూ, వెళ్తూ ఉంటుందని తెలిపారు. డీఎఫ్ఓ సర్వేశ్వర్, కాసిపేట ఎస్సై ప్రవీణ్ కుమార్, బెల్లంపల్లి రేంజర్ పూర్ణచందర్, మంచిర్యాల రేంజర్ రత్నాకర్, డిప్యూటీ రేంజర్లు ప్రవీణ్ నాయక్, గౌరి శంకర్, సంతోష్, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్, బీట్ ఆఫీసర్లు ఉన్నారు.



జీఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని మంచిర్యాల మున్సిపాలిటీని ప్రభుత్వం కార్పొరేషన్‌గా మార్చిన నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలో మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు జీఐఎస్ ఆధారిత ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ శాఖ-హైదరాబాద్ అదనపు సంచాలకులు రమేష్ బాబు, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ శివాజీతో కలిసి సంబంధిత అధికారులకు మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనల రూపకల్పనపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా నవీకరించడం జరుగుతుందని, ఈ క్రమంలో డ్రోన్ సర్వే ద్వారా సంబంధిత వివరాలను సేకరించడం జరిగిందన్నారు. సంబంధిత శాఖల ద్వారా కార్పొరేషన్ రూపకల్పనతో పాటు నివాస ప్రాంతాలు, పారిశ్రామికంగా, వ్యాపార పరంగా అభివృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించడం జరుగుతుందని, ఆయా ప్రాంతాలలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, బ్రాడ్ నెట్‌వర్క్, ట్రాఫిక్ ప్లానింగ్, మెడికల్, నీటి వనరులు, పరిశ్రమల స్థాపన ఇతరత్రా అంశాలకు సంబంధించిన వివరాలను సంబంధిత శాఖల నుండి సేకరిస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ సర్వే ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, బేస్‌మ్యాప్ రూపొందించి సంబంధిత శాఖల ద్వారా వివరాలను సేకరించి పరిశీలించడం జరుగుతుందన్నారు. స్టడీ మ్యాప్స్ తయారు చేసి సంబంధిత శాఖలతో సమావేశం నిర్వహించి ముసాయిదా మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని తెలిపారు. ఆమోదిత ముసాయిదా ప్లాన్‌ను ప్రచురించి అభ్యంతరాలు, ఫిర్యాదులు, సలహాలు స్వీకరిస్తామన్నారు. అనంతరం తుది ప్రణాళికను నిర్ధారించి అమలు చేసే దిశగా కృషి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం మాస్టర్ ప్లాన్ సంబంధించి వివరాలతో కూడిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శాఖల వారిగా అందించవలసిన సమాచారం, విధులు, బాధ్యతలు, వివిధ అంశాలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు, రైతు నల్ల చట్టాలు రద్దు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను, మూడు రైతు నల్ల చట్టాలను వెంటనే రద్దు చేసి జిల్లా అభివృద్ధి కోసం పార్లమెంట్‌లో ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా నాలుగు కోడ్‌లను తీసుకురావడాన్ని, మూడు రైతు నల్ల చట్టాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం కోడ్‌లను, రైతు నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు, జిల్లాకు కేటాయింపుల్లో బీజేపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆదిలాబాద్ జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేయడం కోసం, మూతపడ్డ సిసిఐని తెరిపించడం కోసం, ఆదిలాబాద్ నుండి ఆర్మూర్ వరకు రైల్వేలైన్‌ను నిర్మించడం కోసం, టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపట్టకపోతే జిల్లా ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో రైతు సంఘాల జేఏసీ నాయకులు లోకారి పోశెట్టి, ఏఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్కా దేవిదాస్, సిఐటియు జిల్లా



ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ నారాయణ, టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు కడదరపు అశోక్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు సుభాష్, హరీష్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర టెలీ కమ్యూనికేషన్ డైరెక్టర్‌గా బోరే రవీందర్



బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన బోరే రవీందర్ కేంద్ర టెలీ కమ్యునికేషన్ డైరెక్టర్ ఎన్నికయ్యాడు. ఆయనను మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ పార్టీ మండల నాయకుల సహాయ సహకారాలు అందించడంతోనే మండల అధ్యక్ష, డైరెక్టర్ పదవులు వచ్చాయన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన

నవతెలంగాణ-నిర్మల్ రూరల్



బేటి బడావో బేటి పడావో పథకం 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 45 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం దిలావార్‌పూర్ కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆడ పిల్లల చదవు ఎంత ముఖ్యమో తెలియజేశారు. ఈ సందర్భంగా డీసీపీఓ మురళి మాట్లాడుతూ లింగ సమానత్వం, బాలికల చదువు, సాధికారత, బాల్యవివాహాల నిర్మూలన, సైబర్ క్రైమ్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇందులో ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

నవతెలంగాణ-నార్నూర్



ఆదివాసీ గ్రామాల్లో రోడ్డు సమస్యతో పాటు నీటి ఎద్దడి లేకుండా చూడాలని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందోర్ దాదిరావ్, మండల అధ్యక్షుడు మడావి సాగర్ అన్నారు. మంగళవారం ఖైర్‌దాట్వా గ్రామంలో పర్యటించిన కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎండా కాలం వచ్చిందంటే ఆదివాసీ గ్రామాల్లో నీటి కష్టాలు మొదలవుతాయన్నారు. సుదూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. తాగు నీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. ఇందులో ఆదివాసీ సంఘాల నాయకులు చతుర్ శావ్, మడావి జైవంత్‌రావ్ ఉన్నారు.

ఎస్సీలను మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ ప్రభుత్వం ఎస్సీలను మోసం చేస్తుందని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ ఆరోపించారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ద్వారా 341 ఆర్టికల్ ప్రకారం వర్గీకరణ చేస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ లక్ష డప్పులు వెయ్యి గొంతుకలు అనే కార్యక్రమం మాలల గురించి కాకుండా ఎస్సీ వర్గీకరణపై చేయాలన్నారు. సుప్రీంకోర్టు కేవలం మోడీ సర్క్యులేషన్ అనుసరించినట్లుగా ఉందని ఆరోపించారు. రిజర్వేషన్ వ్యవస్థ వచ్చింది అప్పుడు ఉన్న ఎస్సీలపై వివక్షత అంటరానితనం పోవాలని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎస్సీలను అందరినీ ఒకే విధంగా పొందుపరిచి రిజర్వేషన్లను తీసుకురావడం జరిగిందని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం ఉన్న బీజేపీ ప్రభుత్వం మనువాద సిద్ధాంతాన్ని అమలు చేస్తుందని ఆరోపించారు. ఆర్థిక వ్యత్యాసాలను పరిగణలోకి ఈ ప్రభుత్వాలు తీసుకొని ఈ విషయం రాజ్యాంగానికి పూర్తి విరుద్ధం కావాలని ఈ ప్రభుత్వం ఎస్సీలను విడదీయటానికి కుట్ర చేస్తున్నదన్నారు. దీనిని దళిత బహుజన వర్గాలు వ్యతిరేకించాలని కోరారు. ఈ ప్రభుత్వాలు మాలలపైన వివక్షత చూపుతోందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ న్యాయబద్ధంగా జరగాలన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు మేకల మల్లన్న, సింగరి అశోక్, పాశం రాఘవేంద్ర, గడుగు గంగన్న, మేదరి స్వామి ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాధి ముబారక్ చెక్‌లను పంపిణీ చేశారు. లబ్దిదారులకు తహసీల్దార్ కలీం అందించి మాట్లాడుతూ చెక్ ఇచ్చిన రోజే చెక్ డబ్బులు రావని, దానికి సమయం పడుతుందన్నారు. లబ్దిదారులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేందర్, ఆర్ఐ నాగోరావ్, సాయినాథ్ పాల్గొన్నారు.

దేశ ప్రధాని మోడీకి పాలాభిషేకం



నవతెలంగాణ-ఇచ్చోడ

ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులు కేటాయింపులపై మంగళవారం మండల కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్ర పటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు ప్రాధాన్యత ఇచ్చినందున నరేంద్ర మోడీకి ధన్యవాదలు తెలిపారు. భవిష్యత్‌లో ఆదిలాబాద్ జిల్లాకు రావాల్సిన నిధులు వస్తాయని ధీమావ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మడి భీమిరెడ్డి, మాధవరావు, కార్యకర్తలు డుక్రే దామోదర్, పాటిల్ పవర్, సంతోష్, సూర్య ప్రకాష్, బాబ్జి, తులసి రామ్, సంతోష్, రాయపల్లి సంతోష్, మల్లేష్, రాము, విటల్, రఫిక్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండల కేంద్రంలో మంగళవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. పార్టీ రాష్ట్ర నాయకుడు రితేష్ రాథోడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల వారికి అనుకూలంగా ఉందన్నారు. ఇది జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేయడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి కేంద్ర ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు జగన్, శేఖర్, రమేష్ పాల్గొన్నారు.

వైద్య కళాశాల నోటీసు బోర్డుపై జాబితా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో 52 ఉద్యోగాలకు సంబంధించి నవంబర్ నెలలో దుర్గం ఏజెన్సీ ద్వారా ఉద్యోగ నియామకం ప్రకటనకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మాత్రమే సంబంధించిన జాబితాను నిర్మల్ జిల్లా వైద్య కళాశాల నోటీసు బోర్డుపై అందుబాటులో ఉంచడం జరుగుతుందని దుర్గం అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ అధ్యక్షులు దుర్గం శేఖర్ ఒక ప్రకటనలోపేర్కొన్నారు. అదేవిధంగా అధికారిక వెబ్ సైట్ నిర్మల్.ఎన్ఐసీ.ఇన్‌లోనూ 5వ తేదీ నుండి జాబితా అందుబాటులో ఉంటుందన్నారు. 52 ఉద్యోగాలకు గానూ గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించి అభ్యంతరాలను మాత్రమే ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈనెల 5 నుండి 8 వరకు ఉదయం 10 గంటల నుండి 4:30 వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించి, సహకరించాలని కోరారు.

కుల గణనలో తప్పులే

నవతెలంగాణ-బోథ్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కులగణన నివేధికలో తప్పులే ఉన్నాయని, వాటి ప్రతులను పార్టీ శ్రేణులు బూడిద చేయాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు అన్నారు. మంగళవారం సొనాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు కొండమడుగు గణేష్ మాట్లాడుతూ అగ్రకులాల జనాభా 10 శాతం ఉంటే దానిని 16 శాతం చేశారని, 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభాని 46 శాతంగా చూపించడం ఎంత నిజమని ప్రశ్నించారు. 21శాతం ఉండాల్సిన ఎస్సీని కేవలం 17 శాతంగా, 12 శాతం ఉండాల్సిన ఎస్టీని 10 శాతం చూపించారని ఆరోపించారు. ఈ జనాభా లెక్కల్లో ఇంత కుట్ర ఏందుకని, దేశంలోనే అగ్రకులాల జనాభా అత్యంత తక్కువ ఉంది తెలంగాణ రాష్ట్రంలోనే అని తెలిపారు. ఈ సర్వే రిపోర్ట్‌ని రద్దు చేసి నూతన సర్వే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. త్వరలో ధర్మ సమాజ్ పార్టీ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు కుందూరు సుధాకర్, మహారాజ్, నాయకులు గొర్రె గంగయ్య, అవునూరి ఆడేల్లు, కుందూరు రమేష్, గొర్రె ఉషన్న, మానాల రాజు పాల్గొన్నారు.



కల్తీలేని పోషకాహారాన్ని అందించడమే లక్ష్యం

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-నార్నూర్



ఓ పక్క ప్రజలకు నాణ్యమైన, కల్తీలేని పోషకాహారాన్ని అందించడంతో పాటు దీన్ని మహిళా సంఘాలకు మంచి ఉపాధినిచ్చే విధంగా సమన్వయం చేస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మండలం ఖైర్‌దాట్వా గ్రామంలో ఇప్ప పువ్వుతో మోవా లడ్డు తయారీ కేంద్రాన్ని కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన కలెక్టర్‌ను గిరిజన సాంప్రదాయ వాయిద్యాల నడుమ ఘనంగా స్వాగతించారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పలు స్వయం సహాయక బందాల నుంచి సభ్యులను ఎంపిక చేసి శిక్షణ అందించారు. వీరి ఆధ్వర్యంలో 12 మంది సభ్యులతో ప్రత్యేకంగా గిరిజన మోవా లడ్డు గ్రూప్ను ఏర్పాటు చేశారు. వీరికి రూ.3 లక్షల రుణ సదుపాయం కల్పించి యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో సహజ సిద్ధంగా లభ్యమయ్యే ఇప్ప పువ్వులో పుష్కలమైన పోషకాలుంటాయన్నారు. దీంతో ప్రత్యేకంగా లడ్డును తయారు చేసి అందరికి అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా మోవా లడ్డు గ్రూపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్నగా ప్రారంభించుకుని, పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారాన్ని క్రమంగా విస్తరించుకోవాలన్నారు. గర్భిణులు, సికిల్సెల్ ఎనిమియా, తలసేమియా వంటి రక్తహీనత వ్యాధులతో బాధపడే వారికి ఈ లడ్డు ఎంతో ప్రయోజకరంగా ఉంటుందన్నారు. నార్నూర్, గాదిగూడ మండలాల్లోకి కిరాణా షాపులకు సరఫరా చేసి విక్రయాలు జరిగేలా చూసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని క్యాంటీన్ల నుంచి ఆర్డర్లు ప్రారంభమయ్యాయని, నాణ్యత, రుచి తగ్గకుండా చూసుకుంటే మరిన్ని ఆర్డర్లను పొందే అవకాశముంటుందన్నారు. కాగా అంతకుముందు నార్నూర్‌లోని 30 పడకల ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలోని ఓపీ సేవలు, వైద్యులు, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. బ్లడ్ బ్యాంక్‌ను పరిశీలించారు. రక్త నమూనాల సేకరణ, పరీక్షల కోసం తరలిస్తున్న తీరును ఆరా తీశారు. మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు ఆధారమైన ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ రవీందర్ రాతోడ్, డీఎంహెచ్ నరేందర్ రాతోడ్, ఏజెన్సీ డీఎంహెచ్ కుడ్మెత మనోహర్, తహసీల్దార్ రాజలింగం, ఎంపీడీఓ జవహర్ లాల్, ఏపీఎం రమేశ్, గ్రామ పటేల్ మడావి నారంజీ, ఆదివాసీ నాయకులు, సీసీలు, మహిళ సంఘాల సభ్యులున్నారు.



క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి : నిర్మల్ కలెక్టర్



నవతెలంగాణ-నిర్మల్ రూరల్

క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం సోన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన పెంచి, నివారణ చర్యలు, ఈ వ్యాధితో పోరాడుతున్న వారిని ప్రోత్సహించడం క్యాన్సర్ డే ముఖ్య లక్ష్యమన్నారు. మారుతున్న జీవనశైలి కారణంగా సమాజంలో క్యాన్సర్ వ్యాధి తీవ్ర రూపం దాలుస్తుందన్నారు. ప్రజల నిత్య జీవన విధానంలో ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం మెరుగైన ఆరోగ్య అలవాట్లను పెంపొందించుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాధి రాకుండా ఉంటుందన్నారు. నిరంతర వ్యాయామం, చక్కని ఆరోగ్య అలవాట్లను పాటించడం ద్వారా క్యాన్సర్‌కు దూరంగా ఉండవచ్చని తెలిపారు. ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా క్యాన్సర్ వ్యాధిని నయం చేసుకోవచ్చని వివరించారు. వ్యాధికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయని సరైన చికిత్స ద్వారా నయం చేసుకోవచ్చన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం అనేక ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌లు, ఆరోగ్య సంరక్షణ పథకాలు ప్రవేశపెట్టిందని, ప్రజలు వీటిని ఉపయోగించుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలి సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి అందిస్తున్న చికిత్సలకు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌ను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. రోగనిర్ధారణ గది, మందుల గది, బయటి రోగుల, లోపలి రోగుల విభాగాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధిక, వైద్యులు శ్రీనివాస్, తహసీల్దార్ మల్లేష్, ఎంపీడీఓ సురేష్, ఆస్పత్రి సిబ్బంది, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండో వారంలో సెంట్రల్ లేబర్ ఆఫీసర్‌తో చర్చలు



నవతెలంగాణ-నిర్మల్ టౌన్

టోల్ ప్లాజా కార్మికులు, కంపెనీ ప్రతినిధులతో లేబర్ ఆఫీసర్ సమావేశానికి కంపెనీవారు గైర్హాజరు కావడంతో ఈనెల రెండో వారంలో తిరిగి సెంట్రల్ లేబర్ ఆఫీసర్ రామగుండంతో చర్చలు ఉంటాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ తెలిపారు. నిర్మల్ లేబర్ ఆఫీసులో కలెక్టర్ ఆదేశాల మేరకు ఫేర్వెల్ కంపెనీ మేనేజర్ సీఐటీయూ యూనియన్, లేబర్ ఆఫీసర్ డీసీఎల్ ముత్యం రెడ్డి చర్చల్లో భాగంగా కార్మికులందరినీ కొనసాగించాలని, కనీస వేతన ఇవ్వాలని చెప్పాడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల కార్యదర్శులు బొమ్మెనసురేష్, అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ పిప్పరువాడ, నేరడిగొండ, గంజాల్ టోల్ ప్లాజా కార్మికులు 15 సంవత్సరాల నుంచి సేవలు అందిస్తున్నారన్నారు. కార్మికులకు పాత కంపెనీ రిద్ది సిద్ది ఒప్పంద ప్రకారం రూ.24000 నుంచి 29 వేల వేతనం ఇవ్వాలన్నారు. కానీ ఫిబ్రవరి 10 నుంచి కొత్తగా ఫేర్వెల్ టోల్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజ్‌మేంట్ నిర్వహించబోతుందన్నారు. వారు ఉన్న జీతం కన్నా ఇప్పుడు ఒక్కొక్క కార్మికునికి రూ.6000 నుంచి 8 వేలు తగ్గించి ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. లేబర్ కోర్టు చట్టాల ప్రకారం సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం కార్మికులకు గతంలో ఇచ్చే జీతం కన్నా 25శాతం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంజాల్ యూనియన్ అధ్యక్షులు ఎం.రమేష్, నాయకులు గంగాధర్, రాజేశ్వర్, శ్రావణ్, రాజకుమార్, నేరడిగొండ అధ్యక్షులు లక్షణ్, పిప్పరువాడ సంతోష్, కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

చల్లంగా చూడు నాగోబా..!



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి గాంచిన నాగోబా జాతర ప్రారంభమై ఆరవ రోజు కొనసాగుతుండడంతో భక్తుల తాకిడి ఉంది. మంగళవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో పాటు వరంగల్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సమేతంగా నాగోబా ఆలయాన్ని దర్శనం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి నాగోబా మోమెంటో, శాలువతో సత్కరించారు. అదేవిధంగా జాతర చివరి రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలి వచ్చి నాగోబాను దర్శించుకోని పూజలు చేశారు. జిల్లా కేంద్రం నుంచి ఆర్టీసీ సేవలు కేస్లాపూర్ వరకు ఏర్పాటు చేయటంతో మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. జాతరకు వచ్చిన భక్తులు తమ కుటుంబాలకు జాతరలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో వివిధ వస్తువులు కోనుగోలు చేయడంలో నిమగ్నమయ్యారు.

ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ప్రతినెల మొదటి మంగళవారం డాక్టర్ సద్దాం ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్ డే సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సద్దాం మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే డెలివరీ అయ్యేలా చూడాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు దూరంగా ఉండాలంటే ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని సూచించారు. అదే విధంగా మండలంలోని వాంకిడి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి 42 మందికి టీబీ టెస్టులకు తెమడను సేకరించారు. అనంతరం బెస్ట్ అవార్డు వచ్చిన సందర్భంగా హెచ్ఈఓ రవీందర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంతోష్, హెచ్ఎస్ స్వర్ణలత, ఎమ్ఎల్‌హెచ్‌పీ మౌనిక, వాణి, భీమరాజు, నికిత, అమీబాయి పాల్గొన్నారు.



మొరం టిప్పర్‌కు తూతూ మంత్రంగా జరిమానా



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్‌లో అక్రమంగా మొరం తవ్వకాలు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. అక్రమంగా తరలిస్తున్న మొరంను కష్టపడి ఆర్ఐ సత్యనారాయణ పట్టుకున్నారు. తరువాత పై స్థాయి అధికారి తూతూ మంత్రంగా జరిమాణాలు వేసి విడిలి పెట్టారు. దీంతో రెవెన్యూ అధికారుల తీరుపై అనుమానలు వ్యక్తం అవుతున్నాయి. ఖానాపూర్ మండలంలోని సత్తెనపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న ఓ మొరం టిప్పర్‌ను సోమవారం రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ పట్టుకొని తహసీల్దార్ కార్యాలయనికి తరలించారు. ఈ విషయమై తహసీల్దార్ స్పందించకపోవడంతో ఆర్ఐను వివరణ కోరాగా రూ.2500 ఫైన్ వేసి టిప్పర్‌ను విడిచిపెట్టినట్లు తెలిపారు. గతంలో మొరం ట్రాక్టర్‌ను పట్టుకున్న పెద్ద మొత్తంలో జరిమానా వేసే అధికారులు టిప్పర్లలో మోరాన్ని తరలిస్తున్న ఇంత తక్కువ జరిమానాలు వేయడంపై అనుమానాలకు తావిస్తుందని పలువురు చర్చించుకుంటున్నారు.

వీఆర్ఏ నాయకుల ముందస్తు అరెస్ట్



నవతెలంగాణ-నిర్మల్ రూరల్

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో మంగళవారం హైదరాబాద్‌లో వీఆర్ఏల ముట్టడి కార్యక్రమానికి పిలుపు నిచ్చారు. దీనికి తరలివెళ్లకుండా ముందస్తుగా దిలావార్‌పూర్ మండల వీఆర్ఏ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు పోశెట్టి మాట్లాడుతూ వీఆర్ఏలకు పే స్కేల్ అందించాలని, 60 సంవత్సరాలు పైబడిన వారి వారసురులకు ఉద్యోగాలల్లో నియమించుకోవాలని డిమాండ్ చేశారు.

మాజీ సర్పంచుల అరెస్ట్

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని అసెంబ్లీ ముట్టడిని నిర్వహిస్తున్న దిలావార్‌పూర్ మండల మాజీ సర్పంచ్లు, సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షులు జంగం వీరేష్ కుమార్, మధుకర్, రాజును పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను చెల్లించిన తర్వాతనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు సేవలు మరువలేనివి

నవతెలంగాణ-నార్నూర్

బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు స్వర్గీయ ఆడే దత్త సేవలు మరువలేనివని మాజీ జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నాలుగో వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గజానంద్ నాయక్, పీఏసీఎస్ ఇన్‌చార్జ్ చైర్మన్ సురేష్ ఆడే, జేపీసీ మాజీ చైర్మన్ రాథోడ్ ఉత్తం, ఫ్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, వసంత్ ఆడే, చవాన్ మహేందర్, హరిచంద్, లోకండె చంద్ర శేఖర్, భీక్కు, శాంతారావ్, నూర్‌సింగ్, చవాన్ ప్రకాష్, ఆడే విశ్వనాథ్, డీఈ ధర్మెందర్ ఉన్నారు.

ప్రధాన మంత్రిని కలిసిన బీజేపీ ఎల్పీ నాయకుడు

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

బీజేపీ సభాపక్ష నాయకుడు, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులు మంగళవారం ఢిల్లీలోని క్యాంపు కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. స్థానిక సంస్థల్లో పార్టీ గెలుపుకు కృషి చేయాలని ప్రధాని చెప్పారని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయనతో పాటు మహేశ్వర్ రెడ్డి భార్య కవితా రెడ్డి, కుమారుడు, కుమార్తె, అల్లుడు ఉన్నారు.

కౌన్సిల్ మెంబర్‌గా గంగాధర్

నవతెలంగాణ-తాంసి

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా మండల మాజీ జడ్పీటీసీ తాటిపెల్లి గంగాధర్(రాజు)ను సన్మానించారు. మంగళవారం జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందంతో పాటు తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన నాయకులతో పాటు వివిధ మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు అభిమానులు పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ పార్టీ కోసం పని చేస్తున్న ఒక మామూలు కార్యకర్తలను పార్టీ గుర్తించి ఉన్నత పదవులు ఇచ్చేది కేవలం బీజేపీనే అని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు అశోక్, అరుణ్, సదానందం, దేవిదాస్ ఉన్నారు.

జిల్లా స్థాయిలో సత్తా చాటిన వేదం విద్యార్థులు

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంలోని వేదం పాఠశాల విద్యార్థులు సూచీర్ ఇండియా నిర్వహించిన సీవీ రామన్ ఓలంపియాడ్ టెస్ట్‌లో ప్రతిభను చాటారు. నాల్గవ తరగతి చదువుతున్న ఎం.సాయి చరణ్, పీ.ఆరాధ్య జిల్లా స్థాయిలో మొదటి స్థానాన్ని దక్కించుకున్నారు. ఈనెల 16న హైదరాబాద్ లలిత కళాతోరణం ఆడిటోరియంలో అవార్డ్ అందుకుంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్ తెలిపారు. విద్యార్థులను ఆయనతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

పంట దిగుబడి రాక రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతు దిగుబడి రాకపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఆసిఫాబాద్ సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొందగూడ గ్రామానికి చెందిన కొమ్రం పోషయ్య(55) తనకున్న పదేకరాల్లో పత్తి సాగు చేశారు. పత్తి పంట దిగుబడి రాకపోవడంతో నష్టం జరిగిందని ప్రతీ రోజు బాదపడుతూ, సోమవారం మధ్యాహ్నం మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగారు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడి చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-వాంకిడి



మండల కేంద్రంలోని కేజీబీవీలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి స్థలాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో అదనపు తరగతి గదులు నిర్మిస్తే విద్యార్థులు ప్రార్థన చేయడానికి, ఆడుకోవడానికి ఆట స్థలం ఉండదని పాఠశాల సిబ్బంది తెలిపారు. పాఠశాల ముందు భాగంలో గతంలో మార్కెట్ యార్డు కోసం కేటాయించిన స్థలంలో నిర్మిణ పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంఈఓ, ఏఈ కిరణ్, కేజీబీవీ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రెగ్యులర్ విద్యాధికారులను నియమించాలి : డివైఎఫ్ఐ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో విద్య వ్యవస్థ ఇతర జిల్లాలతో పోలిస్తే వెనుకబడి ఉందని, దీనికి తోడు ఇన్‌చార్జి విద్యాధికారులతో పర్యవేక్షణ కరువైందని, వెంటనే రెగ్యులర్ విద్యాధికారులను నియమించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇన్‌చార్జి పర్యవేక్షణ ఎప్పటి వరకు కొనసాగుతుందని ప్రశ్నించారు. రెగ్యులర్ అధికారులు లేక పర్యవేక్షణ కరువైందన్నారు. జిల్లాకి ప్రభుత్వం విద్యాశాఖ అధికారిని నియమించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడుతున్న వేళ ఇన్‌చార్జి విద్యాధికారి ఉండడం నిర్వహణ భారంగా మారుతుందన్నారు. వెంటనే జిల్లా అధికారులు కలెక్టర్ స్పందించి ప్రభుత్వానికి నివేదించి రెగ్యులర్ ప్రాతిపదికన విద్యాధికారిని నియమించేలా చూడాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గెడం టికనంద్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షులు కొరెంగ మాలశ్రీ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు అవగాహన



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే సందర్భంగా డి ఎం హెచ్ ఓ సీతారామ్ నాయక్ ఆశా కార్యకర్తలకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణకు, ఎక్కడైనా బాల్య విగ్రహాలు జరిగితే సమాచారం ఇవ్వాలని, లేదా 1098 కాల్ చేయాలని అన్నారు. అలాగే సకాలంలో గర్భిణులకు వైద్య పరీక్షల కోసం సమీప ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అశ్రీన్, హెల్త్ సూపర్వైజర్ అనార్తి, ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

డాక్టరేట్ అవార్డు పొందిన ఎంఈఓకు సన్మానం



నవతెలంగాణ-బెజ్జూర్

వెల్ ఎడ్యుకేషనల్ అండ్ పీస్ కౌన్సిల్ డాక్టరేట్ అవార్డును మండల విద్యాకారిణి డాచంకోట్ సునీత న్యూఢిల్లీలో పొందారు. మంగళశారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎంఈఓని సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ ఖమర్ మాట్లాడుతూ ఇంతటి ఉన్నత గౌరవాన్ని ఆకర్షణీయమైన వ్యక్తిత్వం, సేవాభావం రంగంలో డాక్టరేట్ అవార్డు అందుకున్నారని తెలిపారు. గౌరవాన్ని పొందడం మండలంతో పాటు జిల్లాకు గర్వకారమన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ ఏలేశ్వరం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పూణేష్, శ్యాం, సంతోష్, రమేష్ బాబు, ఇందిరా, విష్ణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రధాన కాలువకు వట్టివాగు నీటి విడుదల



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వట్టివాగు ప్రధాన కాలువ ద్వారా నీటిని కిందికి వదిలినట్లు వట్టివాగు ఏఈ పవన్ తెలిపారు. రైతుల కోరిక మేరకు నీటిని వదులుతున్నట్లు వివరించారు. కాల్వ ద్వారా వదులుతున్న నీటిని రైతులకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నీటిని పంటలకు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబాన్ని ఆదుకుంటాం

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని కుకూడా గ్రామానికి చెందిన పెద్దల కైలాస్ అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందడంతో మంగళవారం అంత్యక్రియాలు నిర్వహించారు. సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అంతిమ సంస్కారాల్లో పాల్గొని పాడే మోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్త కైలాస్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్యలున్న తనను సంప్రదించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు బషారత్ ఖాన్, లింగయ్య ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూనే నాణ్యమైన విద్యాబోధన అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మండలంలోని మాలన్‌గొంది గ్రామంలో గల గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులకు శుద్ధమైన తాగునీటిని అందించాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పథకం ద్వారా జిల్లాలో చేపట్టిన పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేస విధంగా అధికారులు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా తడిపొడి చెత్త సేకరణ, వర్మి కంపోస్టు తయారీ, నర్సరీల నిర్వహణ విధులలో అలసత్వం, నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలకు ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా హాజరు కావాలని, విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, మురుగు కాలువలు, కనీస మౌలిక వసతులు కల్పించే విధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు.

మారుపేర్ల డిపెండెంట్ల పోరాటానికి మద్దతు



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణిలో ఉద్యోగం చేసి అన్‌ఫిట్, మరణించిన మారుపేర్ల కార్మికుల డిపెండెంట్‌లు చేస్తున్న పోరాటానికి తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని కేంద్ర కమిటీ వైస్ ప్రెసిడెంట్ ధరావత్ మంగీలాల్ తెలిపారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధించుకున్న తర్వాత పెండింగ్‌లో ఉన్న ఎన్నో సమస్యలను కేసీఆర్, టీబీజీకేఎస్ కార్మికులకు పరిష్కారం చూపిందని గుర్తుచేశారు. అందులో భాగంగా జాతీయ సంఘాలు 1998 సంవత్సరంలో తాకట్టు పెట్టిన డిపెండెంట్ ఉద్యోగాలు కూడా తిరిగి అందించడం జరిగిందని, 1980 దశకంలో అప్పుడు కార్మికులకు అవగాహన లేక మారుపేరుల మీద ఉద్యోగంలో చేరారని తెలిపారు. ఈ విషయం ఇటు సింగరేణి యాజమాన్యానికి అటు ప్రభుత్వాలకు తెలిసిన విషయమే కానీ ఈరోజు కేసీఆర్ ప్రకటించిన కారుణ్య నియామకంలో అన్‌ఫిట్ అయ్యారన్నారు. కానీ ఎవరో కంప్లైంట్ చేశారని విజిలెన్స్ ఎంక్వయిరీల పేరిట అన్‌ఫిట్ అయిన మారుపేర్ల కార్మికుల వారసులకు ఉద్యోగాన్ని నిరాకరించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం, గుర్తింపు సంఘం రాష్ట్ర ప్రభుత్వం పోరాటం చేస్తున్న డిపెండెంట్‌ల ఆవేదనను అర్థం చేసుకొని వారికి వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మాత్రాజు శ్రీనివాసరావు, ఏరియా కార్యదర్శిలు మారిన వెంకటేష్, అలవేణి సంపత్, సెంట్రల్ కమిటీ నాయకులు, ఓరం కిరణ్, టీబీజీకేఎస్‌సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం బెల్లంపల్లి ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు , నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

గురుడుపేట సీఆర్టీని సస్పెండ్ చేసిన పీఓ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని కౌటాల మండలం మొగడ్‌దగడ్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని గురుడుపేట ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీగా విధులు నిర్వహిస్తున్న శారదను విధుల నుండి తొలగిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా తెలిపారు. మంగళవారం జిల్లాలోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు అంశాలపై వివరాలు తెలుసుకునేందుకు దాదాపు 40 పాఠశాలల ఉపాధ్యాయులకు వీడియో కాల్ చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని మొగడ్‌దగడ్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని గురుడిపేట గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టీ కె.శారద గైర్హాజరు కావడంపై ఎస్ఈఆర్‌పీ పోచం, ప్రధానోపాధ్యాయులు అశోక్‌లను వివరణ కోరగా ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరయ్యారని తెలపడంతో సదరు సీఆర్టీనీ విధుల నుండి తొలగించాలని ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, విద్యారంగ అభివృద్ధిలో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నూతన మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడంతో పాటు నాణ్యమైన విద్యా బోధన దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తూ ప్రతి విద్యార్థికి మంచి భవిష్యత్తు అందించే దిశగా తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని ఆదేశించారు.

ఉత్పత్తి సాధనకు ప్రత్యేక పథకం : జీఎం

నవతెలంగాణ-రెబ్బెన

ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపి ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం సంస్థ ప్రత్యేక ప్రోత్సాహక పథకాన్ని ప్రవేశ పెట్టిందని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఖైరిగూడ ఉపరితల గని ఆవరణలో ప్రత్యేక ప్రోత్సాహక పథకంపై ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాకు నిర్దేశించికున్న 37.50 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలన్నారు. ప్రత్యేక ప్రోత్సాహక పథకం ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాన్ని చేకూర్చడంతో పాటు సంస్థ మనుగడను మరింత బలోపేతం చేయనుందన్నారు. రానున్న 55 రోజుల్లో ఉద్యోగులు గైర్హాజరు లేకుండా చుసుకోవాలన్నారు. రక్షణతో పని చేసి ఉత్పత్తి సాధనలో బెల్లంపల్లి ఏరియాను అగ్రగామిగా నిలపాలన్నారు. జనవరి మాసంలో అత్యదిక ట్రిప్పులు నడిపిన శావల్, డంపర్ ఆపరేటర్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి మచ్చగిరి నరేందర్,



ఇన్‌చార్జి ప్రాజెక్ట్ ఇంజినీర్ కె.నరేష్, మేనేజర్ జే.శంకర్, సేఫ్టీ ఆఫీసర్ ఎ.నారాయణ, డిప్యూటి పీఎం వేణు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బాలేశ్వర రథోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వసంత పంచమిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పెద్దవాగు ఒడ్డున గల బాలేశ్వర స్వామి ఆలయంలో రథోత్సవ వేడుకలు అంబరాన్నంటేలా సాగాయి. ఉదయం నుండి అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం కార్యక్రమం చేపట్టారు. రథసప్తమిని పురస్కరించుకొని స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో భక్తులు ఆలయం ఎదురుగా గల రహదారి నుండి నీటి వరకు తీసుకువెళ్లే రథోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు రథోత్సవ వేడుకల్లో పాల్గొని తాళ్లతో కట్టిన రథాన్ని లాగుతూ తమ భక్తిని చాటుకున్నారు. తొమ్మిది రోజుల నుండి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రముఖులు

రథసప్తమని పురస్కరించుకొని బాలేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి, నాగేంద్ర దంపతులు ఉదయం పూజలు చేశారు. ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు, ఎస్డిపిఓ చిత్తరంజన్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు చిలువేరు వెంకన్న, గాదవేణి మల్లేష్ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎస్పీకి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలనంతరం సన్మానించారు.

జాతరకు పోలీసుల పటిష్ట బందోబస్తు

రథోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయావరణలో నిర్వహించే జాతరకు జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చిన నేపథ్యంలో ఉదయం నుండి సీఐ రవీందర్ నేతృత్వంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ నుండి ఆలయం వరకు అన్ని చౌరస్తాలో పోలీసులు బందోబస్తు కొనసాగింది. ఆలయం వద్ద ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేసి వాహనదారులకు ఇబ్బంది కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

జిల్లా కేంద్రంలో పత్తి వ్యాన్ బోల్తా

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయం ఎదుట గల ప్రధాన రహదారిపై మధ్యాహ్నం పత్తి వ్యాన్ బోల్తా పడింది. చింతలమానపల్లి మండల కేంద్రానికి చెందిన నూకల మొండయ్య వ్యాపారస్తునికి చెందిన పత్తి వ్యాన్‌ను డ్రైవర్ పోచయ్య నడుపుకుంటూ ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు వద్ద గల జిన్నింగ్ మిల్లుకు తీసుకువెళ్తున్నాడు. సాయిబాబా ఆలయం దగ్గరిలోకి రాగానే అదుపుతప్పడంతో ఒక్కసారిగా బ్రేకులు వేయగా అక్కడికక్కడే పల్టీ కొట్టింది. అయితే అధిక లోడు రావడంతో పాటు డ్రైవర్ నిర్లక్ష్యం కూడా ప్రమాదానికి కారణమైన పోలీసులు అంచనా వేశారు. ప్రధాన రహదారి అయిన సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

బీట్ ఆఫీసర్‌కు సన్మానం



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రామయ్యను ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మజారుద్దీన్ ఆధ్వర్యంలో మంగళవారం రేంజ్ కార్యాలయంలో సన్మానించారు. బీట్ ఆఫీసర్ రామయ్య 2021లో అటవీ శాఖలో చేరారు. గతేడాది గ్రూపు-4 నోటిఫికేషన్ వెలువడడంతో ఒక వైపు వృత్తికి న్యాయం చేస్తూనే మరో వైపు గ్రూప్-4 నోటిఫికేషన్ ఉద్యోగానికి సాధన చేశాడు. గ్రూపు-4లో ప్రతిభ కనబర్చి మున్సిపల్ శాఖలో వార్డ్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అటవీ శాఖ సిబ్బంది రామయ్యను సన్మానించి అభినందలు తెలిపారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు స్రవంతి, తిరుమల్ రావు, బీట్ ఆఫీసర్లు నర్సింహా రెడ్డి, వందన, సిబ్బంది వందన పాల్గొన్నారు.

ముగ్గురిపై అట్రాసిటి కేసు నమోదు

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని బోర్లకుంట గ్రామానికి చెందిన లొనారె సత్యనారాయణ, అతని కొడుకులు సాయి, ప్రసాద్‌లపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్టు ఎస్సై కందూరి రాజు తెలిపారు. ఈ నెల 2న అదే గ్రామానికి చెందిన డోంగ్రి తిరుపతిపై గొడ్డలి కామతో దాడి చేసి గాయపర్చారని పేర్కొన్నారు. ఆపే ప్రయత్నం చేసిన తిరుపతి భార్య హేమలతను కూడా గాయపర్చారని వివరించారు. చంపుతామని బెదిరించారాని బాధితుడు తిరుపతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

రాజకీయ నాయకులతో సమావేశం



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు-2024, వార్డుల వారిగా పెరిగిన అనుబంధ ఓటర్లు తదితర వాటిపై ఎంపీడీఓ రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 4 ఎంపీటీసీ స్థానాలకు గాను అదనంగా మరొక ఎంపీటీసీ స్థానం పెంచటం జరిగిందని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున గ్రామాలలో బ్యానర్లు, పోస్టర్లు అంటించొద్దన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బోయిరే బండు, బీజేపీ మండల అధ్యక్షులు కుకుడే రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బిట్టి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపైన అవగాహన ఉండాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యార్థి దశ నుంచే చట్టాలపైన అవగాహన ఉండాలని కాగజ్‌నగర్ షీటీం సభ్యురాలు రమాదేవి అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని బుట్టపల్లి జడ్పీఎస్-ఎస్ హై స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఇందులో మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌ల గురించి తెలియజేశారు. సామాజిక మాధ్యమాలు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ వంటి వాటిని వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన జాంగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని మహిళలకు రక్షణకు షీ టీంలు పనిచేస్తున్నాయని, సైబర్ క్రైమ్ గురైతే 1930కు డయల్ చేయాలని, అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. అదే విధంగా కాగజ్‌నగర్ షీ టీం ఫోన్ నంబర్ 8712670565ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనురాధ, సునీత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీనివాస్‌ను సన్మానించిన నూతన జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు దోని శ్రీశైలం ముదిరాజ్ డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతు పార్టీ బలోపేతానికి, రానున్న సంస్థగత ఎన్నికల్లో పార్టీ గెలుపుకు కృషి చేయాలని సూచించారు. కార్యకర్తలను కలుపుకుంటు ముందుకు సాగాలన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-జన్నారం

తిమ్మాపూర్ గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలి సర్వస్వం కోల్పోయిన గోల్కొండ పోచమల్లు కుటుంబాన్ని ఆదుకోవడానికి దండేపల్లి మండలం తాళ్లపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది మంగళవారం రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా ఇటీవల దుబాయిలో రోడ్డు ప్రమాదంలో మరణించిన కూకటికారి రమేష్ కుటుంబానికి రూ.5వేలు, ఆంగ్ల ఉపాధ్యాయురాలు రుక్మిణి తన వంతు సహాయంగా వ్యక్తిగతంగా రూ.5 వేలు అందించారు. ఇరు కుటుంబాలకు చెందిన విద్యార్థులు గోల్కొండ చరణ్, కూకటికారి కౌశిక్ తాళ్లపేట ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిరంగి సుదర్శన్, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పాఠశాల ప్రహారీని పరిశీలించిన డీఆర్‌డీఓ

నవతెలంగాణ-లక్సెట్టిపేట



మండలంలోని జెండావెంకటాపూర్, పోతపెల్లి గ్రామాల్లోని ప్రాఠశాలలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన ప్రహరి గోడ నిర్మాణాన్ని మంగళవారం డీఆర్‌డీఓ కిషన్ పరిశీలించారు. రైతులకు పశువుల కొట్టాలు, అజోల గడ్డి పెంపకం, నాడెపు కంపోస్ట్, నీటి సంరక్షణకు చెక్ డ్యామ్స్, కిచెన్ షెడ్స్, స్కూల్ కాంపౌండ్ వాల్స్ వంటి సుస్థిర ఆస్తులు ఉపాధి హామీ పథకంలో నిర్మిస్తున్నామని అన్నారు. వెంట ఎంపీడీఓ సరోజ, ఏపీఓ వేణు గోపాల్, ఈసీ స్వామి, పంచాయతీ సెక్రటరీస్ హరికృష్ణ, రాజ శేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ బూసిరాజు రాజన్న పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- ఎంపీడీఓ సత్యనారాయణ



నవతెలంగాణ-జైపూర్

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న తాత్కాలిక ఎంపీడీఓ కార్యాలయ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఎంపీఓ శ్రీపతి బాపురావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్‌తో కలిసి ఎంపీడీఓ తాత్కాలిక భవన నిర్మాణ పనులు పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టరును కోరారు. దీనికి ముందు తాగునీటి సరఫరాపై కొనసాగుతున్న ప్రత్యేక కార్యక్రమం ద్వారా పెగడపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ను పరిశీలించడంతో పాటు నీటి సరఫరా తీరును పరిశీలించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాను వాటర్ ట్యాంకుకు అనుసందానం చేసి ప్రతి ఇంటింటికి నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి సరఫరాలో పైప్ లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని, సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈఈ గ్రిడ్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉదయ్ కుమార్, పావని, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలే కీలకం



నవతెలంగాణ-నస్పూర్

సీసీ కెమెరాలను అమర్చుకోవడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలోని కృష్ణ కాలనీలో 07 సీసీటీవీ కెమెరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. సీసీ కెమెరాలను అమర్చుకోవడం శుభ పరిణామమని, అలాగే మిగతా శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని వార్డుల ప్రజలు కూడా సీసీటీవీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ద్వారా కాలనీలో జరుగుతున్న చిన్న చిన్న గొడవలు, ప్రమాదాలను ఖచ్చితంగా కనిపెట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. కెమెరాలు పనిచేయడం ద్వారా మనకు చాలా వరకు నేరాలు తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సంతోష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మారుపేర్ల బాధితులకు అండగా సీఐటీయూ



నవతెలంగాణ-నస్పూర్

మారుపేర్ల బాధితులకు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)అండగా నిలుస్తుందని శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ అన్నారు. మారుపేర్ల సమస్యపై ఉద్యోగాలు రాని కార్మికుల వారసులు గోలేటి నుంచి కొత్తగూడెం వరకు పాదయాత్ర నిర్వహించేందుకు మంగళవారం శ్రీరాంపూర్ జీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ విచారణ ఎదుర్కొంటున్న వారికి సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ పూర్తి మద్దతు తెలుపుతుందన్నారు. గతంలో అన్ని కార్మిక సంఘాలు కలిసి ఆర్‌ఎల్సీ వద్ద యాజమాన్యంతో మారుపేరుల సమస్యపై సర్క్యులర్ విడుదల చేస్తామని ఒప్పందం చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. దీనికి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సరి కాదన్నారు. ప్రతి ఎలక్షన్‌లో యూనియన్లతో పాటు రాజకీయ పార్టీలు కూడా మారుపేర్ల సమస్య పరిష్కరిస్తామని మేనిఫెస్టోలో పొందుపరుస్తూ తీరా గెలిచాక వారి సమస్యను పట్టించుకోవడం లేదన్నారు. వారి బతుకులు వయసు పెరుగుతూ, ఉద్యోగం రాక ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వీరిలో ఒక యువకుడు ఆత్మహత్య కూడా చేసుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం వీరిపై సానుకూలంగా స్పందించి, వెంటనే ఉద్యోగాలు కల్పించాలని సీఐటీయూగా వారి పోరాటానికి మద్దతు తెలుపుతూ డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మారుపేర్ల బాధితులతో పాటు యూనియన్ ఏరియా నాయకులు వెంగళ శ్రీనివాస్, కస్తూరి చంద్రశేఖర్, శైల శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సిరికొండ శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

కమిషన్ నివేదికను ఆమోదించడాన్ని ఖండిస్తున్నాం

నవతెలంగాణ-నస్పూర్

ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్సీ వర్గీకరణ కమిషన్ నివేదికను ఆమోదించిన ఏక పక్ష నిర్ణయాన్ని జాతీయ మాల మహానాడు మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షులు జింజుపల్లి నర్సింగ్, అధికార ప్రతినిధి తలారి రాజు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గుమ్మడి శ్రీనివాస్ ఖండిస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-1లో ఎస్సీ, అత్యంత వెనుకబడిన కులాలు సంచర కులాలు ఒక శాతమని, గ్రూప్-2 లో మాదిగ, మాదిగ ఉపకులాలు తొమ్మిది శాతమని, గ్రూప్-3లో మాల, మాల ఉప కులాలు ఐదు శాతమని నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు పేర్కొన్నారు. దీనిని ఖండిస్తూ, ఎస్సీ ఉప వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని, ఆ ఉద్యమానికి యావత్ మాలలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

నేటి నిరసనలు జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్



నవతెలంగాణ-జన్నారం

కేంద్ర ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దుంపల రంజిత్ కుమార్ పిలుపు నిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక బడ్జెట్‌లో రాష్ట్రనికి కేటాయించాల్సిన నిధులు, సంక్షేమానికి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా, శ్రమ జీవులను, కార్మికులకు, రైతులకు అందరికి ఉపయోగం లేకుండా కేవలం ప్రయివేట్ సంస్థలకు అనుకూలంగా తెచ్చిన ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ ఫిబ్రవరి 5న రాష్ట్ర వ్యాప్త నిరసనలకు వామపక్ష కార్మిక సంఘాలు, సీఐటీయూ పిలుపునిచ్చిందన్నారు. బుధవారం అన్ని మండలాల్లో జరిగే నిరసన కార్యక్రమాల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ అంబటి లక్ష్మణ్, రాజన్న, సుధాకర్, మల్లవ్వ కార్మికులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగిఉండాలి



నవతెలంగాణ-నస్పూర్

ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని దీంతో క్యాన్సర్ మొదటి స్టేజ్‌లోనే నివారించడానికి అవకాశం ఉంటుందని శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణ అన్నారు. మంగళవారం సీసీసీలోని ఎస్సీఓఏ క్లబ్‌లో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ శ్రీరాంపూర్ ఏరియా యాజమాన్యం ఆధ్వర్యంలో డీవై సీఎంఓ డాక్టర్ పి.రమేష్‌బాబు అధ్యక్షతన క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, నివారణ చర్యలకు సంబంధించిన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ వైద్య అవగాహన సదస్సుకు ఏరియా జనరల్ మేనేజర్ సూర్యనారాయణ, సేవా అధ్యక్షురాలు మాలతి పాల్గొని, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణలో శ్రీరాంపూర్ ఏరియా వైద్య అధికారులు, వైద్య సిబ్బంది ఎల్లవేళలా కృషి చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా ఈ అవగాహన, వ్యాధి నిర్ధారణ పరీక్షల సదస్సును ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉంటే సంస్థ అభివృద్ధి చెందుతుందని, ఉద్యోగులందరూ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ ఉండాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అనేది ముఖ్యమని, వ్యాధి నిర్ధారణ చేసుకుని దానికి సంబంధిత మందులను వాడాలని తెలిపారు. ఈ సందర్భంగా సేవా అధ్యక్షురాలు మాలతి మాట్లాడుతూ మహిళలు ఇటువంటి అవగాహన సదస్సులలో పాల్గొనాలని, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన అన్ని అంశాలను తెలుసుకుంటూ, కుటుంబాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. ఉద్యోగులకు జనరల్ సర్జన్ డాక్టర్ వి.శ్రీకాంత్, గైనకాలజిస్ట్ డాక్టర్ జి.హరిత, డాక్టర్ లోకనాథ్ రెడ్డి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ వ్యాధులకు సంబంధించిన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఇన్‌చార్జ్ డీజీఎం రాజేశ్వర్, డీవై సీఎంఓ డాక్టర్ ప్రసన్న కుమార్, సీనియర్ పీఓ పి.కాంతారావు, సేవా సెక్రటరీ కొట్టే జ్యోతి, పిట్ కార్యదర్శి విజయ లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేయాలి

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరామ్



నవతెలంగాణ-తాండూర్

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అన్ని రంగాల్లో రానించేలా కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కోదండరామ్ సూచించారు. సోమవారం రాత్రి నిర్వహించిన విద్యా భారతి విద్యాసంస్థల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు, గోలేటి సింగరేణి జీఎం శ్రీనివాస్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ప్రస్తుత బోధనా విధానం విద్యార్థులపై ఒత్తిడి పెంచే విధంగా ఉన్నదని తెలిపారు. కౌమార దశలో విద్యార్థులకు విద్యతోపాటు శారీరక ఎదుగుదల, మానసిక ప్రశాంతత, క్రీడా నైపుణ్యం సమాజం పట్ల అవగాహన అవసరమవుతుందని తెలిపారు. విద్యార్థులకు వివేకం విజ్ఞానం పర్యావరణ పరిస్థితులు, దేశభక్తిపై ప్రేరణ కల్పించాలన్నారు. ఒక వ్యక్తి జన్మ తీసుకున్నది మొదలు వారు ఏ అనుభవాలను తీసుకోవడానికి జన్మించారో గ్రహించచాలని తెలిపారు. విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా తల్లిదండ్రులు వారి విద్యా విధానాలకు ప్రాధాన్యతను ఇస్తూ ప్రోత్సహించాలని తెలిపారు. తల్లిదండ్రుల ఇష్టాలను పిల్లలపై బలవంతంగా రుద్దకూడదని తెలిపారు. ప్రతి విద్యార్థికి భాషా పరిజ్ఞానం ప్రాంతీయతపై అనురాగం, దేశభక్తిని పెంపొందించాలని సూచించారు. ఎమ్మెల్యే ప్రేమ సాగర్‌రావు మాట్లాడుతూ తాండూరు మండల పరిసర ప్రాంతాల ప్రజలకు గత 25 సంవత్సరాలుగా విద్యా సదుపాయాలనందిస్తూ వారి ఎదుగుదలకు దోహదం చేస్తున్న విద్యా భారతి విద్యాసంస్థల అధినేత సురభి ఆగమరవు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యా భారతి విద్యాసంస్థల్లో చదివిన పూర్వ విద్యార్థులు, అధికారులు, నాయకులు తెలంగాణ ఉద్యమకారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సురభి గోదా క్షేత్ర ఆవరణలో జరిగిన విద్యా భారతి విద్యా సంస్థల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మిరిమిల్లు గొలుపే విద్యుత్ కాంతి, భారీ సభస్థలి రంగస్థలంలో విద్యార్థులు ఆడి, పాడారు. కార్యక్రమంలో సురభి లక్ష్మి కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించి పలువురిని మంత్రముగ్ధుల్ని చేసింది.

పల్లె దవాఖానాను సందర్శించిన కేంద్ర బృందం



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని గంగిపల్లిలో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాను ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర వైద్య బృందం సభ్యులు, డీఎంహెచ్ఓతో కలిసి మంగళవారం సందర్శించారు. పల్లె దవాఖానాల్లో అందుతున్న సేవలను, దవాఖానా స్థితిగతులను పరిశీలించారు. అహ్లాదకర వాతావరణం, ఔషద గుణాలు కలిగిన మొక్కలతో పల్లె దవాఖానాల ద్వారా వైద్య సేవలు అందించాల్సిన తీరును, కేంద్ర వైద్య బృందం ప్రామాణికంగా పాటిస్తుందన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. మాత శిశు సంరక్షణ వైద్య సేవలు పరిశీలించారు. చంటి పిల్లలు, బాలింతలకు క్రమం తప్పకుండా అందజేయాల్సిన వైద్య సేవలతో పాటు వాక్సినేషన్ చేస్తున్న తీరును పరిశీలించారు.

బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు స్థానికంగా అందుతున్న వైద్య సేవలు, సీజనల్‌గా వచ్చే అంటు వ్యాధులు మలేరియా, డెంగ్యూ, డయేరియా నిర్మూలన తీసుకుంటున్న చర్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ మేనేజర్ సాగర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ అనిత, మెడికల్ ఆఫీసర్ అనిల్ కుమార్, ముస్తాఫా, శివ ప్రతాప్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ వేదశ్రీ, ప్రశాంతి (డీపీఓ), ఏక్యూఎం మౌనిక పాల్గొన్నారు.

పంటల సంరక్షణపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-జన్నారం

మండల రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటల సంరక్షణపై అవగాహన కల్పించారు. మంగళవారం రైతు వేదికలో పందుల నుంచి పంటలను ఎలా రక్షించుకోవాలో వివరించారు.

కార్యక్రమంలో ఏఓ సంగీత, ఏఈఓ త్రిసంధ్య, దివ్య, అక్రమ్, సాయి పాల్గొన్నారు.

ఓపెన్‌కాస్ట్ ప్రయత్నాలు విరమించుకోవాలి

నవతెలంగాణ-హాజీపూర్

బెల్లంపల్లి శాంతిఖని పాత గనిని ఓపెన్‌కాస్ట్‌గా మార్చే ప్రయత్నాలను సింగరేణి సంస్థ విరమించుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు పార్టీ) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శాంతిఖని గనిని ఓపెన్‌కాస్ట్‌గా మారిస్తే పరిసర గ్రామాలైన ఆకెనపల్లి, పాత బెల్లంపల్లి, సుబ్బారావుపల్లె, లింగాపూర్, శ్రావణపల్లి, బర్వాన్‌పల్లి గ్రామాలతో పాటు బెల్లంపల్లి పట్టణం విధ్వంసానికి గురవ్వడంతో పాటు వ్యవసాయ వనరులు దెబ్బతింటాయని తెలిపారు. జలవనరులు అడుగంటిపోయి, వన్యప్రాణులు అంతరించే ప్రమాదముందని పేర్కొన్నారు. ప్రజలు భూ నిర్వాసితులుగా మారి ఆర్థిక ఇబ్బందులతో జీవన ప్రమాణాలకు ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఓసీపీలు ఏర్పాటు చేసిన ప్రాంతాలు ఎక్కడ అభివృద్ధికి నోచుకున్న దాఖలాలు లేవని, భూనిర్వాసితులను అనాదిగా సింగరేణి యాజమాన్యం ప్రభుత్వాల అండతో మోసగిస్తూనే ఉన్నాయని తెలిపారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి తెలంగాణ స్వరాష్ట్రంలోనూ ఓసీపీల ప్రభావంతో నష్టపోయిన వారికి మెరుగైన ప్రత్యామ్నాయం చూపకుండా ఈ ప్రాంతాలను విధ్వంసం చేస్తూ ప్రజల జీవన హక్కులను అభివృద్ధి పేరిట హరిస్తున్నారని పేర్కొన్నారు. సింగరేణి మోసపూరిత మాటలు నమ్మకుండా పర్యావరణ పరిక్షణ, గ్రామ, పట్టణ పరిరక్షణ, వ్యవసాయ భూముల సంరక్షణతో పాటు ఓసీపీ విధ్వంసాన్ని వ్యతిరేకించేలా పరిసర గ్రామాల, పట్టణ ప్రజలు, ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిస్తున్నట్టు తెలిపారు. శాంతిఖని ఓసీపీని నిలిపివేయడంలో అధికార పార్టీ ఎమ్మెల్యే వినోద్, ఎంపీ వంశీలు భాధ్యతగా చొరవ చూపాలని లేనిపక్షంలో ఎమ్మెల్యే, ఎంపీలతో పాటు కాంగ్రెస్ మండల, పట్టణ నాయకులకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

దేవునిగూడెంలో శిక్షణ అధికారుల పర్యటన



నవతెలంగాణ-జన్నారం

మండలం దేవునిగూడెంలో మిలిటరీ ఇంజనీరింగ్ శిక్షణ అధికారుల పర్యటన కొనసాగుతోంది. మంగళవారం ఆ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, సీఎస్సీ మీసేవా కేంద్రాన్ని సందర్శించారు. మొదట పాఠశాలలో విద్యార్థులను కలుసుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే సేవా కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరిత, అంగన్‌వాడీ టీచర్లు ఆయాలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కుల గణన సర్వేలో మోసం



నవతెలంగాణ-జన్నారం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో బీసీల జనాభా తగ్గడం ఓసీల జనాభా పెరగడం దారుణమని బీసి కులాల ఉద్యమ పోరాట సంఘం జిల్లా కన్వీనర్ ఆడేపు లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రాష్ట్ర బీసీ సంఘాల పిలుపు మేరకు మండల కేంద్రంలో కులగణన సర్వే ప్రతులను చెత్తబుట్టలో వేసే నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య కోకన్వీనర్ మూల భాస్కర్‌గౌడ్ మండలం బీసీ సంఘం అధ్యక్షుడు గూడ అశోక్, మండలం ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు ఐలవేణి రవి, పూసల సంఘం మండల మాజీ అధ్యక్షుడు గుడ్ల రాజన్న, బాలిన మధు పాల్గొన్నారు.

గుండెపోటుతో అదనపు ఎస్ఐ మృతి

- పది నెలల్లో పదవీ విరమణ



నవతెలంగాణ-జన్నారం

జన్నారం పోలీస్‌స్టేషన్‌లో అదనపు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రాథోడ్ తానాజీనాయక్ (60) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. పోలీస్ క్వాటర్స్‌లో నివాసముంటున్న తానాజీ తెల్లవారుజామున చాతి నొప్పి వస్తుందని హోంగార్డు బ్రహ్మకు ఫోన్ చేసి చెప్పగానే ఎస్ఐ రాజవర్ధన్ సూచనతో బ్రహ్మం, ఎఎస్ఐలు మండల కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స నిర్వహిస్తున్న సమయంలో గుండెపోటుకుగు గురై మృతి చెందినట్టు నిర్ధారించారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని ఎందా గ్రామానికి చెందిన రాథోడ్ తానాజీ నాయక్ 1983 సంవత్సరంలో పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి, హెడ్ కానిస్టేబుల్, ఎఎస్ఐ, ఆరేళ్ల క్రితం ఎస్ఐగా ప్రమోషన్ పొంది జన్నారంలో అదనపు ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. వచ్చే నవంబర్ 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. మృతునికి భార్య పుష్పలతతో పాటు వివాహమైన ఇద్దరు అమర్, వినాయక్ కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ఉమ్మడి జిల్లా లింగాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు వినాయక్ ఎండీ డాక్టర్‌గా పనిచేస్తున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | జనవరి 05, 2025 | www.navatelangana.com

రుచికరమైన భోజనాన్ని అందించాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ ను, వారి పనితీరును పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. పదవ తరగతి వార్షిక పరీక్షలకు బాగా చదివి సన్నద్ధం కావాలని, మంచి గ్రేడ్‌లతో ఉత్తీర్ణత సాధించడం ద్వారా పాఠశాలకు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. వంటగదిని పరిశీలించిన ఆయన పరిశుభ్రమైన వాతావరణంలో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. పాఠశాల కు వచ్చిన సరుకులను పరిశీలించారు. సరుకుల్లో నాణ్యత లేకపోతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. భోజనం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్న ఉపాధ్యాయులు ఉన్నారు.

రేషన్ బియ్యం కోసం అవస్థలు

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని రేషన్ బియ్యంకోసం లబ్దిదారులు అవస్థలు పడుతున్నారు. ఒకటో తారీకు నుండి రేషన్ బియ్యం అందిస్తున్నారు. ప్రజలు రేషన్ బియ్యం కోసం ఒకటో తేదీ ఉదయం నుండే షాప్‌ల వద్ద వేచి ఉంటే గాని బియ్యం దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. రెండు రోజులు అనంతరం రేషన్ సరుకులు తీసుకుందామని ప్రజలు ఆలస్యం చేస్తే షాపుల్లో రేషన్ బియ్యం అయిపోయాయి తమ వద్ద లేవు అంటూ షాప్ డీలర్లు అంటున్నారు. ప్రజలు ఏ షాపులో రేషన్ బియ్యం ఉన్నాయో అంటూ గ్రామంలోని అన్ని షాపులకు వద్దకు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మండల కేంద్రంలోని షాపు వద్ద సోమవారం ఉదయం రేషన్ బియ్యం కోసం పదుల సంఖ్యలో మహిళలు, పురుషులు నిలబడ్డారు. గ్రామ ప్రజలకు సరిపడా రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తున్న ప్రతి లబ్దిదారుడికి ఎందుకు రేషన్ బియ్యం అందడం లేదో తెలియడం లేదు. అన్ని షాపుల వద్ద బియ్యం అయిపోయాయి అంటే మరి బియ్యం తీసుకోని లబ్ధిదారుల పరిస్థితి ఏంటని అంటున్నారు. అధికారులు రేషన్ షాపులపై నిఘా పెట్టి ప్రజలందరికీ రేషన్ సరుకులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని లబ్దిదారులు కోరుతున్నారు.

వేలాల జాతరకు తమవంతు సహకారం అందిస్తాం

- ఎస్టీపీపీ జీఎంతో సమావేశమైన ఏసీపీ



నవతెలంగాణ-జైపూర్

మహాశివరాత్రిని పురస్కరించుకుని వేలాల జాతరకు తరలివచ్చే భక్తుల అవసరార్థం సౌకర్యాల కల్పనకు తమ వంతుగా సహకరిస్తామని సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ జీఎం ఇంచార్జీ ఈడీ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. చెన్నూర్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మంగళవారం జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు జీఎం శ్రీనివాసులతో సమావేశమయ్యారు. జాతర సందర్భంగా అవసరమైన విద్యుత్ లైట్లు, సోలార్ లైట్లు, సింటెక్స్ తాగు నీటి ట్యాంకర్లు, జాతర ఏరియా చదును చేయడం కోసం జేసీబీతో పాటు డోజర్, వాటర్ ట్యాంకర్లు సమకూర్చనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ వనజా రెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతిబాపురావు, ఎస్సై శ్రీధర్, దేవాదాయ శాఖ ఈఓ రమేష్, పంచాయతీ కార్యదర్శి రాకేష్, స్థానిక నాయకులు ప్యాగ లక్ష్మన్, వెంకటస్వామి పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుతులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

శ్రీసత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో గత సంవత్సరం అక్టోబర్‌లో రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పాఠశాల స్థాయిలో ఇచ్చుట క్షమించుట-నిజమైన మానవత్వానికి ప్రధానమైన సుగుణను అనే అంశంపై భగవాన్ శ్రీ సత్యసాయి సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలలో పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి పట్టణంలోని సెంట్ క్లారేట్ స్కూల్, మహాత్మ జ్యోతి పూలే స్కూల్, జిల్లా పరిషత్ పెట్రోల్ పంప్ స్కూల్, వీఐపీ స్కూల్, జిల్లా పరిషత్ (బాయ్స్) స్కూల్, జిల్లా పరిషత్ (గర్ల్స్) స్కూల్, జిల్లా పరిషత్ స్కూల్ రాజా జీరాక్స్ దగ్గర, అరుణోదయ స్కూల్, జిల్లా పరిషత్ స్కూల్ భటపెల్లి, జిల్లా పరిషత్ స్కూల్, చింతాగుడ, కళాశాల స్థాయిలో గవర్నమెంటు జూనియర్ కళాశాల, వివేకానంద జూనియర్ కళాశాల, గవర్నమెంటు డిగ్రీ కళాశాల, వసుందర డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం పొందిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్టుకు పరామర్శ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల పెద్దపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సీనియర్ జర్నలిస్టు బందెల రాజశేఖర్‌ను మంగళవారం ఆదిలాబాద్ నవతెలంగాణ జర్నలిస్టు బృందం సభ్యులు పరామర్శించారు. జనవరి 4న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. పరీక్షించిన వైద్యులు గాయపడ్డ ఒక కాలును తొలగించాలని, అప్పుడే ఆయన కోలుకుంటాడని సూచించడంతో వైద్యులు ఆయన కాలును తొలగించారు. విషయం తెలుసుకున్న జర్నలిస్టులు తమ మిత్రుడి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి మనోధైర్యానిచ్చారు. అనంతరం రూ.9వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయనను పరామర్శించిన వారిలో సీపీఐ(ఎం) ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీనియర్ జర్నలిస్టు ఏ.దయాకర్, నవతెలంగాణ డెస్క్ ఇన్‌చార్జీ రాపర్తి దత్తాత్రి, సబ్‌ఎడిటర్స్ గాజరి మహేశ్, కొండ రాజన్న ఉన్నారు.

సింగరేణి ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతుల అందజేత

నవతెలంగాణ - కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిలో ఉత్పత్తి పెంపుకు కృషి చేసిన ఉద్యోగులకు గని మేనేజర్ లక్ష్మీనారాయణ బహుమతులు అందించారు. గని ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్పత్తిని పెంపొందించడానికి, ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంపొందించడానికి అత్యుత్తమంగా పని చేసిన 15 మంది ఉద్యోగులను గుర్తించి వారికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. షార్ట్ ఫ్లోరర్ ముక్కెర కుమార్, కోల్ కటర్స్ బాలాజీ, గంగయ్య, రాజేష్, రమేశ్, ముద్రసాని రాజ్‌కుమార్, బి.రాజ్‌కుమార్, ట్రామర్ ప్రభాకర్, హాలేజ్ ఆపరేటర్ సురేశ్, పి రమేశ్, సపోర్ట్మెన్ సుధాకర్, టబ్ పుషర్ రవీందర్, ఫిట్టర్ సందీప్, ఎలక్ట్రిషన్ ప్రభాకర్‌కు గని మేనేజర్ గొడిశెల లక్ష్మీనారాయణ బహుమతులను అందించారు. ఈ గుర్తింపు, ప్రోత్సాహం ఉద్యోగులు మరింత కృషి చేయడానికి ప్రేరేపిస్తూ, ఉత్పత్తి పెరుగుదలకు దోహదపడుతుందని గని మేనేజర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివద్ధి పై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-మందమర్రి

జిల్లాలోని మున్సిపాలిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఛాంబర్‌లో కమిషనర్ శాఖాధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ఆర్ పథకం కింద వచ్చిన పనులను త్వరితగతన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రిజిస్టర్లు, మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీల అభివృద్ధికు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో మున్సిపాలిటీలలో పారిశుద్ధ్యం, తాగునీరు, అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్వహణ లాంటి పనులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగిసినందున పరిపాలన సౌలభ్యం కోసం నియమించిన ప్రత్యేక అధికారులు తమ పరిధిలో పనులను పకడ్బంధీగా చేపట్టాలన్నారు. వేసవి కాలం సమీపిస్తున్నందన ప్రతి ఇంటికి నిరంతరాయంగా తాగునీటిని అందించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. చతులపూర్‌లోని డంపింగ్ యార్డ్‌ను సందర్శించి వార్డులలోని ప్రతి ఇంటి నుండి రోజూ తడిపొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. ఇందులో ఉపయోగకరమైన చెత్తను వేరు చేసి కంపోస్ట్ షెడ్‌కు తరలించాలన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా నర్సరీలలో మొక్కలను సిద్ధం చేయాలన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆస్పత్రిలోని వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తూ ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వేసవికాలం సమీపిస్తున్నందున ఎండ వేడిమి నుండి కాపాడుకోవడానికి పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.రాజలింగు, మండల వైద్య అధికారి రమేష్, డిప్యూటీ ఇంజనీర్ ఎం.సుమతి, సానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్యాంసుందర్, రెవెన్యూ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, వైద్యాధికారి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిమితి పెంచడం ప్రజా వ్యతిరేకం



నవతెలంగాణ-మంచిర్యాల

బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని వంద శాతానికి పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని మంచిర్యాల శాఖ ఎల్ఐసీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మంగళవారం ఎల్ఐసీ ఆఫీసు ముందు నిరసన ప్రదర్శన చేపట్టారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న బీమా రంగంలో విదేశీ కంపెనీలకు ఆధిపత్యం కల్పించడానికి తాము వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. రాజ్యాంగంలో ప్రవచించిన సంక్షేమ రాజ్య భావనకు విరుద్ధంగా, ప్రజాసంక్షేమ కార్యక్రమాలకి నిధులనందజేస్తున్న ఎల్ఐసీకి పోటీగా విదేశీ కంపెనీలను నిలపడం దేశప్రయోజనాలకు భంగకరమని విమర్శించారు. దేశమంటే మట్టి కాదోయ్ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్న నిర్మలా సీతారామన్ విదేశీ కంపెనీలకు అనుకూలంగా ప్రవర్తించడం అక్షేపనీయమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఐక్యపోరాటాలకు ఉద్యోగులు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీమా ఉద్యోగుల సంఘం నాయకులు ఆర్. రాజేశం, ఎ.తిరుపతిరెడ్డి, ఎం.రామదాసు, రమేష్‌బాబు, శ్రీనివాస్, హిమశ్రీ, సోనీ, చరణ్ కుమార్, సమత్ కుమార్, ఏజెంట్ల సంఘం నాయకులు పి.రాజబాబు రెడ్డి, మహేష్, తిరుపతి, కుమారస్వామి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కేసులకు భయపడేది లేదు : మాజీ ఎమ్మెల్యే

- ప్రజల పక్షాన ప్రశ్నిస్తూనే ఉంటాం

నవతెలంగాణ-దండేపల్లి



ప్రభుత్వాన్ని ప్రజల పక్షాన ప్రశ్నిస్తూనే ఉంటామని, ఎన్ని అక్రమ కేసులు పెట్టిన భయపడేది లేదని కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం భవనంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకుల పైన కక్షపూరితంగా కేసును నమోదు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్యకర్తకు అండగా పార్టీ ఉంటుందని కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. పార్టీని గ్రామ గ్రామాన బలోపేతం చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు చేయడంలో విఫలమైన సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఒక్కో కార్యకర్త వంద మందితో సమానమని అధైర్య పడవద్దని అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి ప్రజలు పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు నడిపల్లి విజిత్ రావు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పసర్థి అనిల్ నాయకులు కసనగొట్టు లింగన్న, గొల్ల రాజమల్లు, అక్కల రవీందర్, గోట్ల భూమన్న రేణి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులకు పరిహారం అందేలా చూస్తాం

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయ రహదారి 163జీ నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన బాధితుల వివరాలను పరిశీలించారు. 163జీ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధితులకు నష్టపరిహారం చెల్లించడం జరిగిందన్నారు. ఆర్బిట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొదటి జాబితాలో పరిహారం అందని అర్హత గల వారు సంబంధిత పత్రాలు, బ్యాంక్ పాస్ పుస్తకాలతో సంప్రదించినట్లయితే రికార్డులు పరిశీలించి సరిగ్గా ఉన్నట్లు నిర్ధారణ జరిగితే సంబంధిత లబ్దిదారుల నుండి అక్విటెన్సీ తీసుకొని నిర్దేశిత ధరల ప్రకారం పరిహారం చెల్లించడం అందేలా చూస్తామన్నారు.

యువ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి దరఖాస్తులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారత ప్రభుత్వం, కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం నిర్వహించే అంతర్ జిల్లాల యువ ఎక్స్ఛేంజి కార్యక్రమం ఈ సంవత్సరం హైదరాబాదులో నిర్వహించనున్నారని జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన యువతి యువకులకు నైపుణ్య శిక్షణ, మానసిక, శారీరక ఉల్లాసం కోసం అన్ని రకాల ప్రత్యేక నిపుణులతో ఉచిత శిక్షణ ఇచ్చే ఈ కార్యక్రమం ఫిబ్రవరి 11 నుంచి 15 వరకు 5 రోజులపాటు హైదరాబాదులో ఉంటుందని తెలిపారు. ఆసక్తిగలవారు తమ వివరాలను నెహ్రూ యువ కేంద్ర నిజామాబాదు వాట్సాప్ నెంబర్‌కు 9100435410 తెలియజేయాలని జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్ తెలిపారు. ఎంపిక చేయబడిన 25 మందికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారికి ఉచితంగా వసతి భోజనం శిక్షణలో ఉపయోగమయ్యే బూట్లు, టీ షర్టు, ఇతర నిత్యవసరాల కిట్టును అందజేయనున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం చివరిలో ప్రశంసా పత్రం కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు.

రాత్రి వేళలో వాహనాల రాకపోకలకు గ్రీన్ సిగ్నల్



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ అభయారణ్యం పరిధిలోని అటవీ శాఖ చెక్ పోస్టుల వద్ద రాత్రి తొమ్మిది గంటల నుంచి తెల్లవారు ఆరు గంటల వరకు వాహనాల రాకపోకలను అడ్డుకొంటున్న అటవీ అధికారుల చర్యలకు రాష్ట్ర అటవీ శాఖా మంత్రి కొండా సురేఖ అడ్డుకట్ట వేశారు. రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలను అడ్డుకోవద్దని సంబంధిత జిల్లా అటవీ అధికారులకు సూచనలు జారీ చేయాలని రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కంజర్వేటర్‌ను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ మంత్రి కొండా సురేఖను కలిసి రాత్రి వేళల్లో అటవీ చెక్ పోస్టుల వద్ద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి ఎఫ్‌డీపీటీ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే ప్రాతినిధ్యంపై స్పందించిన మంత్రి ప్రజలకు ఆసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలకు అనుమతించాలని పీసీసీఎఫ్‌ను ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో మోహినుద్దీన్ జయంతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్టీయూ వ్యవస్థాపకులు మగ్దూం మోహినుద్దీన్ జయంతి వేడుకలను మంగళవారం ఎస్టీయూ జిల్లాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మూగ శ్రీనివాస్, జాదవ్ అశోక్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, మహాకవి, ప్రముఖ కార్మిక నాయకుడు, ఉర్దూ కవి, హైదరాబాద్ సంస్థానంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ఒకడైన మగ్దూం మోహినుద్దీన్ తెలంగాణలోని మెదక్ జిల్లాలో 1908, ఫిబ్రవరి 4న జన్మించాడని పేర్కొన్నారు. ఉపాధ్యాయ వర్గాన్ని చైతన్య పరుస్తూ, స్టేట్ టీచర్స్ యూనియన్ హైదరాబాద్ పేరుతో ఉపాధ్యాయ సంఘం స్థాపించి, ఉపాధ్యాయ హక్కుల కోసం పోరాటం చేసిన పోరాట యోధుడని పేర్కొన్నారు. మగ్దూం మోహినుద్దీన్ ఆశయ సాధనకు కృషి చేస్తామని అన్నారు. విద్యారంగ సంక్షేమం, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం మోహినుద్దీన్ చూపిన మార్గంలో నడుస్తామని, సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడుతామని అన్నారు. ప్రభుత్వం వెంటనే సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బెజ్జంకి రవీంద్ర, రాష్ట్ర సాంస్కృతిక, క్రీడల కన్వీనర్ పుప్పాల నరేందర్, పూర్వ రాష్ట్ర కార్యదర్శి నూటంకి సత్యనారాయణ, ఆదిలాబాద్ అర్బన్ మండలాధ్యక్షులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

- హాజరైన 33 జిల్లాల క్రీడాకారులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 71వ అంతర్ జిల్లాల కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. దీనికి అసోసియేషన్ అధ్యక్షుడు ఉష్కం రఘుపతి, ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్ హాజరై ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీలు ఈ నెల 7 వరకు జరగనున్నట్లు పేర్కొన్నారు. క్రీడలు శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. క్రీడలను ఎంచుకుంటే రెండు శాతం రిజర్వేషన్స్ సైతం ఉద్యోగ అవకాశాల్లో లభ్యమవుతుందని తెలిపారు. పోటీల్లో ఐక్యమత్యంగా మెలిగి సోదర భావాన్ని చాటాలన్నారు. అనంతరం సింథటిక్ కోర్టులపై ఖమ్మం-హైదరాబాద్, ములుగు - సూర్యపేట జిల్లాల మధ్య ఆటను ప్రారంభించి టోర్నీని ఆరంభించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, పీడీ హరిచరణ్, విఠల్‌రెడ్డి, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

